బొగ్గు బ్లాకుల వేలంపై కమ్యూనిస్టుల కదనభేరి

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 5 : బొగ్గు బ్లాకుల వేలంపై జిల్లాలోని కమ్యూనిస్టులు కదనభేరి మోగించారు. ఇప్పటివరకు వేర్వేరు పోరాటాలు చేపట్టిన వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు శుక్రవారం నుంచి ఐక్య ఉద్యమ కార్యాచరణ ప్రారంభించాయి. ఇందులో భాగంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ప్రతినిధులతో పాటు ఆల్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో దుమ్మెత్తి పోశారు. తెలంగాణకే తలమానికమైన బొగ్గు బ్లాకులను వేలం వేయడమంటే తల నరికి మొండెం మిగల్చటమేనన్నారు. బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉన్న తెలంగాణను సర్వనాశనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని ఆరోపించారు. తెలంగాణ ఎంపీ బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉండి కూడా ప్రైవేటీకరణను అడ్డుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్నికలకు ముందో మాట, తర్వాత మరో మాట అన్నట్లుగా వ్యవహరిస్తుండడం విడ్డూరమన్నారు. బొగ్గు గనులు ఎత్తేస్తే లక్షలాది మంది కార్మికులు ఆగమవుతారని కేంద్రం గుర్తించాలన్నారు. తెలంగాణ ఆర్థిక సంపదను అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, తెలంగాణ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రధాని మోదీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యుడు మంద పవన్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు కళ్యాడపు ఆగయ్య, సీపీఐ నాయకులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బోయిని అశోక్, సీపీఎం జిల్లా నాయకులు సుంకరి సంపత్, డి.నరేశ్‌పటేల్, టేకుమల్ల సమ్మయ్య, పైడిపల్లి రాజు, పున్నం రవి, వడ్ల రాజు, రాయికంటి శ్రీనివాస్, గాజుల కనకరాజు, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, కటికిరెడ్డి బుచ్చన్నయాదవ్, బీర్ల పద్మ, గజ్జల శ్రీకాంత్, కాంపల్లి అరవింద్, నలువాల సదానందం, రోహిత్, కిష్టాపురం లక్ష్మణ్, సాయివేణి రాజమల్లు, నరసింహారాజు, పెందవేసిన రాజేశం, ఇట్ట మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

299 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

మానకొండూర్, జూలై 5: భారీ ఎత్తున ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మానకొండూర్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో పట్టుకున్నారు. నిందితులను ఆదుపులోకి తీసుకుని బియ్యంలోడ్‌తో ఉన్న లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లా కేంద్రం కరీమాబాద్‌కు చెందిన తడక సతీశ్, పోచమ్మమైదాన్‌కు చెందిన జన్ను అనిల్ ఇద్దరూ కలిసి 299 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని లారీ (హెచ్‌పీ 38 హెచ్ 1389)లో వరంగల్ (ఎర్రగట్టుగుట్ట) నుంచి మహారాష్ట్రలోని నాందెడ్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మానకొండూర్ మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు, బియ్యంలోడ్‌తో వెళ్తున్న లారీని పట్టుకున్నారు. లారీ డ్రైవర్, క్లీనర్‌తో పాటు లారీలో ఉన్న తడక సతీశ్ పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీసులు వారిని ఆదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. విచారణలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు అంగీకరించారు. తడక సతీశ్, నాందెడ్‌కు చెందిన లారీ డ్రైవర్ జమీల్ సయ్యద్ అహ్మద్, లారీ క్లీనర్ విఠల్ కుషాల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. మరో నిందితుడు జన్ను అనిల్ పరారీలో ఉన్నాడని చెప్పారు. ఇక్కడ టాస్క్ ఫోర్స్ సీఐ గోపతి రవీందర్, పోలీస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రమణారెడ్డి, కైలాస్ సింగ్, శంకర్, రామయ్య, తిరుపతి ఉన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Jammikunta. Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to Are Basavaiah, S/o: Posham, Age: 69 years, Occ: Rtd Coal mine employee, R/o: H.No. 3-79/13, Korkal village Veenavanka mandal of Karimnagar dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages, Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 (Seven days). from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

In Abadi Jammikunta H/o: Jammikunta, in survey number 1190/B, a dismantled house number 14-1-24 including under vacant plot vide number 3, to an extent of 155.55 Square yards its equivalent to an extent of 130.03 Square meters, within the boundaries bounded on:
North: Plot of Ankam Rajaiah vide plot No. 5,
South: R&B Road leads to Jammikunta to Veenavanka
East: 20-00" width Road
West: Plot belongs to R. Shobarani vide Plot No. 4,
is situated Abadi Jammikunta H/o: Jammikunta village and mandal of Karimnagar dist
Date: 04-07-2024

Sd/- **G. LAXMANA MURTHY,** Advocate
Huzurabad. Cell No. 94403 69866

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.

NT-325758

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

రామడుగు పోలీసుల దాష్టీకం!

- దొంగతనం నెపంతో గిరిజనుడికి చిత్రహింసలు
- రెండు సార్లు స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టిన పోలీసులు
- మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన బాధితుడు



మానవ హక్కుల కమిషన్ కార్యాలయం వద్ద బాధితుడు కనకయ్య, ప్రజా సంఘాల నాయకులు

కరీంనగర్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : బాధితుడి కథనం మేరకు.. రామడుగు మండలం వెలిచాలకు చెందిన కుతాడి కనకయ్య (35) వ్యవసాయ కూలీ (పాలేరు)గా పనిచేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత నెల 11న ఆయన ఇంట్లో నిద్రిస్తుండగా ఉదయం 4 గంటల సమయంలో రామడుగు పోలీసులు వచ్చి స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేశారు. అదే రోజు కరీంనగర్‌లోని సీసీఎస్ స్టేషన్‌కు తరలించారు. మరుసటి రోజు కర్రలు, బెల్టుతో కొట్టారు. లేవలేని స్థితిలో ఉన్న కనకయ్యను అదే నెల 12న రాత్రి 10 గంటలకు ఇంటికి పంపించారు. అప్పటికే అనారోగ్యం పాలైన కనకయ్యను కుటుంబ సభ్యులు దవాఖానలో చేర్పించి చికిత్స అందించారు. కనకయ్య కోలుకుంటున్న తరుణంలోనే గత నెల 26న రామడుగు పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎనిమిది మంది పోలీసులు, ఎస్ఐ కలిసి నేలపై బోర్ల పడుకోబెట్టి కాళ్లు కట్టేసి చేతులు, వీపుపైన నిలబడి నానా చిత్రహింసలకు గురి చేశారు. అరికాళ్లపై కర్రలు, బెల్టుతో విపరీతంగా కొట్టారు. అయితే గత ఏప్రిల్‌లో జరిగిన గొర్రెల దొంగతనం కేసులో నేరాన్ని ఒప్పుకోవాలని తనని చిత్ర హింసలకు గురి చేసినట్టు కనకయ్య వాపోతున్నాడు. ఒప్పుకోకపోతే చంపేస్తామని కూడా బెదిరించారని చెబుతున్నాడు. చేయని నేరాన్ని తానెలా ఒప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశాడు. భార్యా ఇద్దరు పిల్లలున్న కనకయ్య, శుక్రవారం తెలంగాణ మానవ హక్కుల కమిషన్‌తోపాటు డీజీపీకి ఫిర్యాదు చేసి తనకు న్యాయం చేయాలని కోరాడు. అంతే కాకుండా రామడుగు పోలీసుల నుంచి తనకు ప్రాణహాని ఉన్నదని, తనను రెండు సార్లు చిత్ర హింసలకు గురి చేసిన ఎస్ఐ, కానిస్టేబుళ్లపై తగిన చర్యలు తీసుకోవాలని కనకయ్య విజ్ఞప్తి చేశాడు. బాధితుడి వెంట ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పార్థసారథి, కేవీపీఎస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేశ్ తదితరులు మానవహక్కుల కమిషన్‌ను, రాష్ట్ర డీజీపీని కలిసిన వారిలో ఉన్నారు.

చేయని దొంగతనం అంటగట్టి తనను చితక బాదారని ఓ గిరిజన యువకుడు శుక్రవారం మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాడు. రాష్ట్ర డీజీపీకి కూడా ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన గత నెలలో జరిగినప్పటికీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత యువకుడికి ప్రజా సంఘాలు అండగా నిలిచి మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాయి. పోలీసుల దాష్టీకంపై మండిపడుతున్నాయి.

ట్రైన్ ఎక్కబోతు ఒకరి మృతి

జమ్మికుంట, జూలై 5: మాచనపల్లి గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్ (45) అనే వ్యక్తి ఖానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కబోతు ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతుడు జమ్మికుంట నుంచి మంచిర్యాలకు వెళ్లేందుకు శుక్రవారం జమ్మికుంట రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. అప్పటికే ఖానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కదిలింది. శ్రీనివాస్ రైలు ఎక్కే క్రమంలో ఫస్ట్ ప్లాట్ ఫామ్ పై జారిపడ్డాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి ఘటనా స్థలానికి చేరుకున్నాడు. వివరాలు సేకరిస్తున్నాడు. మృతుడికి భార్య సరస్వతి, కొడుకు, కూతురు ఉన్నారు.

మన గ్రోమోర్ స్టోర్‌లో దొంగతనం

శంకరపట్నం, జూలై 5: మండల కేంద్రంలోని మన గ్రోమోర్ స్టోర్‌లో గురువారం రాత్రి దొంగతనం జరిగింది. స్టోర్ మేనేజర్ కథనం ప్రకారం.. కోరమండల్ ఇంటర్‌నేషనల్ లిమిటెడ్ కంపెనీకి చెందిన మన గ్రోమోర్ స్టోర్‌ను కొంతకాలంగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఈ నెల 4న రాత్రి 8 గంటలకు స్టోర్ సిబ్బంది ఎప్పటిలాగే స్టోర్‌ను మూసి ఇండ్లకు వెళ్లారు. 5న ఉదయం వచ్చి చూడగా షెట్టర్ పైకి లేపి ఉంది. లోపలికి వెళ్లి చూడగా స్టోర్‌లోని లాకర్, ఫెస్టిసైడ్ బాటిళ్లు, చోరీకి గురైనట్లు గుర్తించారు. లాకర్‌లోని రూ. 38,476 నగదు, రూ.46,217 విలువైన ఫెస్టిసైడ్స్ బాటిళ్లతో కలిపి రూ. 84,693 విలువైన సొత్తు చోరీకి గురైనట్లు సిబ్బంది తెలిపారు. లాకర్‌ను వెనుక ఉన్న పొలాల్లోకి తీసుకెళ్లి పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. స్టోర్‌ను క్లూస్ టీంతో పాటు కేశవపట్నం పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు. స్టోర్ మేనేజర్ రాయిని సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ఖాళీ చేయని మున్సిపల్ షాపులపై చర్యలు

- తాళాలు వేసిన అధికారులు

కార్పొరేషన్, జూలై 5: కరీంనగర్ నగరపాలక సంస్థకు చెందిన కమర్షియల్ షాపులకు సంబంధించిన బకాయిలు చెల్లించకుండా, షెట్టర్లను ఖాళీ చేయని యజమానులపై నగరపాలక అధికారులు చర్యలు ప్రారంభించారు. నగరపాలక సంస్థకు చెందిన రాజీవ్‌గాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఆరు, కూరగాయాల మార్కెట్‌లోని 14 షాపులకు శుక్రవారం రెవెన్యూ అధికారులు తాళాలు వేశారు. 30 ఏళ్ల క్రితం లీజుకు తీసుకున్న యజమానులు బకాయిలు చెల్లించడం లేదు. కాగా, ఇటీవల వారి లీజు కాల పరిమితి ముగియడంతో ఆయా షాపులకు నగరపాలక అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. పాత యజమానులు వెంటనే షాపులను ఖాళీ చేయాలని ఇప్పటికే అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. కానీ, వారు షాపులను ఖాళీ చేయకపోవడంతో శుక్రవారం చర్యలు చేపట్టారు. ఆయా షాపులకు తాళాలు వేశారు. కార్యక్రమంలో ఆర్‌వో ఆంజనేయులు, ఆర్ఐలు రషీద్, శ్రీకాంత్, సిబ్బంది బాబు, మధు తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ పొల్యూషన్ వాహనదారులపై కేసు

రాంనగర్, జూలై 5: నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనదారుల సౌండ్ పొల్యూషన్‌పై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లా ఖాన్, పర్స రమేశ్, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించి సౌండ్ పొల్యూషన్ వాహనాలపై ప్రత్యేక తనిఖీ చేసి మూడు వాహనాలను సీజ్ చేశారు. జిల్లెలకు చెందిన మణివర్ధన్ కేటీఎం మోటార్ సైకిల్ నంబర్ టీఎస్ 21 హెచ్ 9705, శ్రవణ్ కు చెందిన రాయల్ యెన్ ఫీల్డ్ నంబర్ టీఎస్ 02 ఎఫ్ఈ 8755, బోద అంజికి చెందిన రాయల్ యెన్ ఫీల్డ్ నంబర్ టీఎస్ 35 డీ 9313 వాహనాలను స్వాధీనం చేసుకొని కొత్త చట్టం భారతీయ న్యాయ సంహిత ప్రకారం క్రైం నం.360/2024 U/sec. 281 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేశారు. ఇకపై సౌండ్ పొల్యూషన్ వాహనాలపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లా ఖాన్ హెచ్చరించారు.

నిరుద్యోగులకిచ్చిన హామీలను గాలికొదిలిన ప్రభుత్వం

కలెక్టరేట్, జూలై 5: అసెంబ్లీ ఎన్నికల్లో నిరుద్యోగులకిచ్చిన హామీలను రేవంత్ ప్రభుత్వం గాలికొదిలేసిందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్ ఆరోపించారు. ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం డీఆర్‌వో పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి క్రాంతి, జిల్లా ప్రధాన కార్యదర్శులు శశిధర్‌రెడ్డి, శ్రీరాముల శ్రీకాంత్, ప్రవీణ్, ఉప్పరపల్లి శ్రీను, కుమార్, కటకం లోకేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

తెలంగాణచౌక్, జూలై 5: గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో శుక్రవారం నిర్వహించిన కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కార్యవర్గ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, పెద్దపల్లి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లా పార్టీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహానంది అవార్డుల ప్రదానం

కమాన్‌చౌరస్తా, జూలై 5: తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మన తెలంగాణ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ బాధ్యులకు మహా నంది అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో జిల్లాకు చెందిన కొమ్మ శ్రీనివాస్, శీలం శ్రీనివాస రావు, గాలిపెల్లి రాజు, సతీశ్, వడ్ల సువర్ణ, మాలె సాయి, అలేఖ్య రెడ్డి, చుక్క వెంకటయ్య అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంటీఎంబీఏ కరీంనగర్ జిల్లా సభ్యులు అవార్డులు పొందిన సభ్యులను సత్కరించారు. ఇక్కడ నిర్వాహకులు మెల్ల శ్రీనివాస్, తాండ్ర మీనాకుమారి, దొంత రాజేందర్ జిల్లాల సభ్యులు ఉన్నారు.

వైద్యురాలి ఔదార్యం

విద్యానగర్, జూలై 5 : కరీంనగర్‌కు చెందిన సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ విజయలక్ష్మి సవరన్ స్ట్రీట్‌లో గల బాలికల పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు స్కూల్ బ్యాగులు, లంచ్ బాక్సులు, వాటర్ బాటిళ్లు, డ్రాయింగ్ కిట్స్ పంపిణీ చేసి ఔదార్యాన్ని చాటారు. అనంతరం బాలికలకు తీసుకోవాల్సిన ఆహార నియమాలు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, మంకిండ్ ఫార్మా ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని దవాఖానలకు నోటీసులు జారీ చేస్తాం

- ప్రైవేట్ దవాఖానల్లో ధరల పట్టికలు డిస్ప్లే చేయాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుజాత

ప్రైవేట్ హాస్పిటల్ తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

విద్యానగర్, జూలై 5 : నిబంధనలు పాటించని ప్రైవేట్ హాస్పిటల్స్, స్కానింగ్, ఇమేజింగ్ సెంటర్లపై తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 2010 ప్రకారం చర్యలు తీసుకుని నోటీసులు జారీ చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాత హెచ్చరించారు. శుక్రవారం కరీంనగర్‌లోని పలు ప్రైవేట్ దవాఖానలను ఆకస్మికంగా తనిఖీ చేసి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ యాక్టు ప్రకారం బయోమెడికల్, వేస్ట్ మేనేజ్‌మెంట్, ఇతర పత్రాలను చూశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ప్రైవేట్ హాస్పిటల్స్, స్కానింగ్, ఇమేజింగ్ సెంటర్లు తప్పనిసరిగా తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ధరల పట్టికలను డిస్ప్లే చేయాలని సూచించారు. దవాఖానలో పనిచేసే వైద్యులు, సిబ్బంది వివరాలను డిస్ప్లే చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఫైర్ సేఫ్టీ, పొల్యూషన్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, మున్సిపాలిటీ నియమ నిబంధనలు పాటించాలన్నారు. అన్ని దవాఖానలు వ్యర్థాలను బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం జిల్లాలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఇన్సినేటర్స్‌కు అప్పగించాలన్నారు. నిబంధనలు పాటించని దవాఖానలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఆర్ఎస్వీ నాయకుల అరెస్ట్

కార్పొరేషన్, జూలై 5: ఉద్యోగాలు భర్తీ చేయాలంటూ టీజీపీఎస్‌సీ ముట్టడికి విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపుతో నగరంలో బీఆర్ఎస్ విద్యార్థి, యువజన నాయకులను ముందస్తుగా నగర పోలీసులు అరెస్టు చేశారు. నగరంలో వివిధ విద్యార్థి నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులను శుక్రవారం ఉదయం నుంచే పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ తిరుపతి నాయక్, బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు చుక్క శ్రీనివాస్, పటేల్ శ్రావణ్‌రెడ్డి, ఆరే రవి గౌడ్, పటేల్ సుదీర్‌రెడ్డి, సోమిరెడ్డి రాజనరేశ్‌రెడ్డి, కాటం సురేశ్, బొంకూరి మోహన్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న విద్యార్థి నాయకులను బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ కలుసుకొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం మానుకొని నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూపించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి, యువజన నాయకులు పాల్గొన్నారు.

వీణవంక, జూలై 5: హైదరాబాద్‌లోని టీజీపీఎస్‌సీ కార్యాలయ ముట్టడికి బయలుదేరిన విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు ఆవుల తిరుపతి యాదవ్, అప్పని హరీశ్‌వర్మ, రాపర్తి అఖిల్‌గౌడ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ ఉన్నారు.

ఇల్లందకుంట, జూలై 5: టీజీపీఎస్సీ ముట్టడికి హైదరాబాద్‌కు వెళ్లకుండా బీఆర్ఎస్‌వీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అలేటి శ్రీరాం, నాయకులను ముందస్తుగా ఎస్ఐ రాజ్‌కుమార్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శ్రీరాం మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఇక్కడ బీఆర్ఎస్‌వీ నాయకుడు రత్నాకర్ తదితరులు ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయాలి

చొప్పదండి, జూలై 5: పట్టణంలో చేపట్టిన సెంట్రల్‌లైటింగ్ పనులను త్వరగా ప్రారంభించి, పనులు పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ కాంట్రాక్టర్ జగ్గారెడ్డికి సూచించారు. సెంట్రల్ లైటింగ్ పనుల పురోగతిపై శుక్రవారం కాంట్రాక్టర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, పట్టణంలో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు నిలిచిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ నాగరాజు, వార్డు కౌన్సిలర్లు కొట్టె అశోక్, కొత్తూరి మహేశ్, నాయకులు గుర్రం భూంరెడ్డి, మహేశుని మల్లేశం, పెరుమాండ్ల గంగయ్య, దండె కృష్ణ, నలుమాచు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

మానకొండూర్, జూలై 5: తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీజేవైఎం రాష్ట్రశాఖ పిలుపు మేరకు శుక్రవారం చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపడానికి వెళ్తున్న బీజేవైఎం మండలాధ్యక్షుడు బాషబోయిన ప్రదీప్‌యాదవ్, నాయకులు కోండ్ర వరప్రసాద్, మడ్డి రాకేశ్‌గౌడ్ తదితరులను మానకొండూర్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

చిగురుమామిడి, జూలై 5: బొమ్మనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కానుగంటి రాజమౌళి, మోదుంపల్లి శంకరమ్మ, ఫాలోజు ప్రతిమ బదిలీపై వెళ్లగా శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు ఆధ్వర్యంలో పాఠశాలలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్యామయ్య, జ్యోత్స్న, శంకర్, రమాదేవి, కవిత, షర్మిల, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాధన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఎన్నికలు

కమాన్‌చౌరస్తా, జూలై 5 : జిల్లా కేంద్రంలోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో హెడ్ బాయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్ బాయ్, స్పోర్ట్స్ కెప్టెన్ గర్ల్‌ను శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాధన స్ట్రైకర్స్(ఎల్లో గ్రూప్), సాధన చాలెంజర్స్(గ్రీన్ గ్రూప్), సాధన మిసైల్స్ (రెడ్ గ్రూప్), సాధన వారియర్స్(బ్లూ గ్రూపు) నాలుగు గ్రూపులుగా విభజించి వాటికి కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్‌ను ఎన్నుకున్నారు. అనంతరం విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ రావు టీషర్ట్స్, క్యాప్స్ అందించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి, హెచ్ఎం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారమిత విద్యార్థుల క్షేత్ర పర్యటన

కరీంనగర్ రూరల్, జూలై 5: మంకమ్మతోటలోని పారమిత పాఠశాల 6,7వ తరగతుల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా శుక్రవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్ల